
కథ

# పోలీసు పంచాయితీ

## కాకాని చక్రపాణి

'ఓ అర్ధరూపాయికి బార్లీ గింజలియ్యియ్యా. పిల్ల వళ్లు మసిలిపోతున్నది. బార్లీ నీళ్లిస్తే జరం తగ్గిపోతుందన్నది మా అక్క' అనడిగింది పార్వతి ఆదినారాయణని.

అతనేం మాట్లాడలేదు. వచ్చిన వారికి సరుకులిచ్చి పంపేస్తున్నాడు కానీ, ఈమె సంగతి పట్టించుకోలేదు. సరుకులు కొనుక్కోవటానికి దుకాణానికి వచ్చిన మనుషులు కూడా ఆమెవంక చూడటం లేదు. ఓ మనిషి అక్కడ నిలబడి వుందన్న ధ్యాసే ఎవరకీ వున్నట్టు లేదు.



'ఏంటీ, మాట్లాడవు?' అని రెట్టించింది పార్వతి.
కొనడానికి వచ్చినవారంతా వెళ్లిపోయాక, 'నన్ను బతకనీ, వెళ్లు' అన్నాడు ఆదినారాయణ.

'అట్లంటే ఎట్లా? ఇప్పుడు మట్టువాడపోవాల్నంటే నాకోపిక లేదు. మా ప్రసాదు పొలానికి పోయాడు తండ్రితో. నీక్కూడా మేమంత దుర్మార్గులమయిపోయినామా?' అంది పార్వతి.

'ఆ న్యాయా న్యాయాల సంగతి నాకు తెలీదు. నన్ను అడక్కు. నీకు బార్లీ గింజలు అమ్మిన సంగతి జనానికి తెలిస్తే నన్ను బతకనివ్వరు నన్ను కూడా వెలేస్తారు. నా బతుకు నన్ను బతకనీ. వెళ్ళెళ్లు' అన్నాడతను.

కొట్టుకువచ్చిన మనిషిని వట్టి చేతుల్తో పంపటం అతనికీ కష్టంగానే వుంది. కానీ, అతని చేతుల్లో ఏం లేదు. పార్వతి కుటుంబాన్ని, ఆమె బావగారి కుటుంబాన్నీ గ్రామపెద్ద వెలివేశాడు. వాళ్లతో ఎవరూ మాట్లాడరాదు. మంచినీళ్లు ఇవ్వరాదు. దుకాణాల్లో వస్తువులు విక్రయించరాదు. రైసుమిల్లులో వాళ్ల ధాన్యం ఆడించరాదు అని గ్రామపెద్ద ఆదేశించాడు. ఈ సాంఘీక బహిష్కరణ రెండేళ్లుగా కొనసాగుతోంది.

'పిల్ల జరంతో ఛస్తే, దాని ఉసురు నీకు తగుల్తుంది' అంది కోపంగా పార్వతి.

'ఏంది, నాక్కూడా చేతబడి చేస్తవా?' అన్నాడు ఆదినారాయణ భయపడిపోతూ.

'చేతబడి చేసే శక్తి నాకుంటే నువ్విట్టా మాట్టాడవు'.

'చెప్పకు. అందుకేగా మిమ్మల్ని వెలివేసింది'.

'ఎందుకు వెలేశారో ఆ దేవుడికే తెలియాలి. ఇంతకీ బార్లీగింజలిస్తావా, లేదా?'

ఆదినారాయణ కొట్టు బయటకు అటూ ఇటూ చూసి, కొట్టువేపు ఎవరూ రావటం లేదని నిర్ధారించుకుని, హడావుడిగా బార్లీగింజలు ఓ పొట్లంలో కట్టి ఇచ్చి, 'వెళ్లు, తొందరగా వెళ్లిపో. నేనా గింజలు ఇచ్చానని ఎవరికీ చెప్పకు. ఎవరైనా కొట్టుకొస్తారు. బేగెళ్లు. నీపైసలు కూడా నాకొద్దు' అన్నాడు.

'నేనేం బిచ్చపుదాన్నికాదు' అంటూ అర్ధరూపాయి బిళ్ల అతని గల్లాపెట్టెవైపు విసిరి వెళ్లిపోయింది పార్వతి, కొంగుచాటున బార్లీగింజల పొట్లాన్ని దాచుకుంటూ.



సంఘ బహిష్కరణ కారణంగా ఆ రెండు కుటుంబాలూ ఎంతో ఇబ్బందిపడుతున్నాయి. ఇంట్లోకి ఏ సరుకు కావల్సి వచ్చినా అనంతారం నుండి మట్టువాడ వెళ్లాల్సిందే. మట్టువాడ ఓ మాదిరి పెద్ద ఊరు. అనంతారం నుండి నాలుగు కిలోమీటర్ల దూరం. ఉప్పు కావల్సినా, పప్పు కావల్సినా అంతదూరం వెళ్లాల్సిందే. ధాన్యాన్ని రైసుమిల్లులో ఆడించరు. బండిలో వేసుకుని మట్టువాడ వెళ్లాల్సిందే.

వెంకటేశ్వర్లు, బాలచంద్ర అన్నదమ్ములు. వెంకటేశ్వర్లు భార్య లక్ష్మమ్మ. బాలచంద్ర భార్య పార్వతి. వెంకటేశ్వర్లకి ఒక్కతే కూతురు కృష్ణవేణి. బాలచంద్రకు ఒక కొడుకు, ఒక కూతురు. కొడుకు పేరు ప్రసాదు, కూతురిపేరు భాగ్యలక్ష్మి. పదేళ్ల ఆ పిల్ల జ్వరంతో బాధ పడుతోంది. అందుకే బార్లీ గింజలకోసం పార్వతి ఆదినారాయణ కొట్టుకు వచ్చింది. అన్నదమ్ములకు ఆరెకరాల పొలం వుంది. వెంకటేశ్వర్లు ఏవీ పట్టించుకోడు. వాళ్లదింకా అవిభక్తకుటుంబమే. పేరుకు ఇంటి యజమాని వెంకటేశ్వర్లయినా, నిర్వహణ అంతా బాలచంద్రదే. వెంకటేశ్వర్లుకు లేకలేక ఒక్క కూతురు కలిగింది. ఆమెకు పదహారేళ్లొచ్చాయి. పిల్లకు పెళ్లి చేయాలని బాలచంద్ర చూస్తున్న తరుణంలో ఈ సంఘ బహిష్కారం వచ్చిపడింది. ఊళ్లో వాళ్లెవరూ తమపిల్లను చేసుకోరు. ఊరిబయటి సంబంధాలు చూశాడు బాలచంద్ర. కాని చేతబడులు చేస్తారని పేరు పడగానే ఎవరూ వచ్చి ఆ పిల్లను పెళ్లిచేసుకోటానికి సాహసించటంలేదు. ఆడపిల్లలకు చదువు చెప్పించటం ఆ కుటుంబంలో లేదు. ఒక్క ప్రసాదుకు మాత్రం ఇంటర్మీడియట్ దాకా చదువు చెప్పించారు మట్టువాడపంపి.

ఈ ప్రపంచంలో ఏదీ కారణం లేకుండా జరుగదు. అన్నింట్లో వ్యక్తంగా కారణం కన్పించపోవచ్చు. ఈ సాంఘీక బహిష్కరణకూ కారణముంది. ఊరి పెత్తందారు వెంకట్రాయుడు చెప్పే కారణాలు వేరు. వెంకటేశ్వర్లు పినతండ్రి సూరయ్య మనవడు జ్వరం వచ్చి మూసిన కన్ను తెలీక పడున్నాడు. పిల్లవాడికి ఎనిమిదేళ్లుంటాయి. ఊళ్లో ఆచార్లగారు ఇచ్చిన మందు పనిచెయ్యలేదు. దిష్టి తగిలిందన్నారు. లక్ష్మమ్మకు పాము మంత్రం, తేలుమంత్రం, దిష్టిమంత్రంలాంటివి వచ్చు. ఆమె దిష్టి తీస్తే ఏ అరిష్టమున్నా తొలగిపోతుందని ఆ కుటుంబంలో నమ్మకం. అందుకే, ఆమెను వచ్చి పిల్లవాడికి దిష్టి తియ్యమని కోరాడు పినమామ. లక్ష్మమ్మ వచ్చి దిష్టి తీసింది. పిల్లవాడి కళ్లు చూస్తే పచ్చగా వున్నాయి. 'పచ్చ కామెర్లు' అంది ఆమె. పచ్చకామెర్లకు సూది మంత్రం పెడ్తుందామె. రోగి మూసిన కళ్లమీద సూదులు ఆడిస్తూ ఏదో మంత్రం జపిస్తుంది. ఓ చిన్నగిన్నెలో నీళ్లు పోసి ఆ సూదుల్ని వుంచుతుంది. ఆ మంత్రానికి నీళ్ల రంగు పచ్చగా మారితే పచ్చ కామెర్లు తగ్గుతుందని అర్థం. మంత్రమే కాక పేడలో పెరుగేసి, రోగికి తినిపించి, వైద్యం చేసేదామె. అలాంటి వైద్యం, మంత్రం పెట్టటం ఎప్పటినుండో చేస్తున్నది ఆమె. అలాగే సూరయ్య మనవడికీ చేసింది. కానీ, పిల్లవాడి రుగ్మత ఆ మంత్రానికి, వైద్యానికీ లొంగక పిల్లవాడిని ఎత్తుకు పోయాకనే వివాదం మొదలైంది.

'నీ మనవడు పోయాడంటగా?' అని పరామర్శించాడు వెంకట్రాయుడు సూరయ్యని.

'అవునయ్యా. వైద్యం చేయించినాం, మంత్రం వేయించినాము. కామెర్లంట, పిల్లగాడు మాకు దక్కలేదు' అన్నాడు సూరయ్య.

'లక్ష్మమ్మేగా మీ పిల్లగాడికి మంత్రం వేసింది? ఏం మంత్రం వేసిందో ఏమో, చేతబడులు కూడా చెయ్యగలిగిన మనుషులు వాళ్లు' అన్నాడు వెంకట్రాయుడు.

'అట్లెందుకంటారు లేండి. మనకు ప్రాప్తం లేదు. పిల్లగాడు పొయ్యాడు.'

'మీ తల్లి పొలం నువ్వే కాజేస్తివి. వాళ్లూరుకుంటారుటయ్యా?'

'ఏమో. ఎవరి పాపాన వాళ్లు పోయారు'.

అలా వెంకట్రాయుడితో చెప్పి వచ్చాడు కానీ వెంకట్రాయుడు ఆయన బుర్రలో ప్రవేశపెట్టిన పురుగు తొలుస్తూనే వుంది. ఇంటికొచ్చి కొడుకు గోపాలానికి చెప్పిన దాకా ఆయన మనసుండబట్టలేదు. అతను అగ్గిలోపెట్టిన గుగ్గిలమే అయ్యాడు.

'వెధవ పొలం కోసం ఇంతచేస్తారా. పసికందుకు చేతబడిచేసి చంపుతారా? నీ అన్న కొడుకుల్ని ఇద్దర్నీ చంపితేగానీ నా గుండె మంట చల్లారదు' అంటూ చేతకర్ర తీసుకుని బయలుదేరాడు.

'వాళ్లు చేశారో లేదో, ఉత్త అనుమానంతో వాళ్లను నిందించి ప్రయోజనం లేదు' అన్నాడు సూరయ్య.

'చెయ్యకేం చేసే వుంటారు వెధవలు, తప్పుడు నా కొడుకులు. అన్న కొడుకులని దగ్గరకి తీస్తావు కానీ వాళ్లెంతకైనా తగినవాళ్లే' అన్నాడు గోపాలం.

గోపాలం అన్న 'వెధవపొలం' సంగతి కూడా మీకు చెప్పాలి. సూరయ్య అన్న పేరు కాంతయ్య. అన్నతమ్ములు వాటాలు వంచుకునేటప్పుడు తల్లికి ఓ రెండెకరాలనుకున్నారు. తమ వాటాల గురించి పత్రాలు రాసుకున్నారు కానీ తల్లికిచ్చిన రెండెకరాలకూ ఏ పత్రాలూ లేవు. పొలం సూరయ్య అధీనంలో వుండేది. తనే పండించి అన్నదగ్గరున్న తల్లికి పంట ఇచ్చేవాడు. అలా తల్లి బతికినంత కాలం కొనసాగింది. తల్లి పోయాక అన్న వాటా కూడా ఇవ్వటం మానేశాడు సూరయ్య. 'పోన్లే వెధవ గడ్డి కరుస్తున్నాడు' అని కాంతయ్య ఎప్పుడూ తమ్ముడిని నిలదీసి అడగలేదు. తండ్రిపోయాక బాలచంద్ర 'నాయనమ్మ పొలం మనకు ఎకరం రావాలి. వెళ్లి అడుగుదాం పద' అని తీసుకువెళ్లి పినతండ్రిని అడిగాడు.

'ఏం పొలంరా, మా అమ్మకు వేరే పొలమేం లేదు. అమ్మ అన్న దగ్గరుంటున్నది కదా అని నేనే నా రెండెకరాల్లో పండిన పంట అన్నకిచ్చేవాడిని. మీరిప్పుడు అందులో భాగం కావాలనటం న్యాయంగా లేదు' అన్నాడు సూరయ్య. నిజానికి ఆయన మాటలు కావు అవి. కొడుకు గోపాలం ఆయన చేత అన్పించిన మాటలు అవి.

'చిన్నాయనా, నీకు తెలిసే అబద్ధం ఆడుతున్నావు. అన్న కొడుకులకు అన్యాయం చేస్తే నువ్వు బాగుపడవు' అన్నాడు కోపంగా బాలచంద్ర, అన్నను తీసుకు వెళ్లిపోతూ.

సాయంత్రం కొడుకు పొలంనుండి వచ్చాక, కొడుక్కు నచ్చ చెప్ప ప్రయత్నించాడు సూరయ్య.

'వాళ్ల పొలం వాళ్లకిచ్చేద్దామురా, మనకి న్యాయం కాదు' అని.

'పొలం నువ్వే సాగు చేశావు. కష్టనష్టాలు నువ్వే భరించావు. రెండకరాల పంటంతా అమ్మా, అన్నా అని వాళ్లకు దోచి పెట్టావు ఇన్నాళ్లూ. కనీసం కష్టానికి కూలయినా గిట్టుబాటు కాలేదు నీకు. చెల్లుకు చెల్లు. పెదనాయన కొడుకులకు నువ్వు ఇవ్వాల్సిందేం లేదు. మాట్లాడకు' అన్నాడు గోపాలం దురుసుగా.

'అదేందిరా మా అమ్మ మా అన్న దగ్గరే వుంది. రోగమొచ్చినా రొష్టొచ్చినా వాళ్లే చేశారు. మా వదినమ్మ పోయినా అన్న అమ్మను నా ఇంటికి పంపలేదు. ఉమ్మడి పెట్టుబడులేమున్నా అన్నే పెట్టాడు. నన్నేరోజూ పైసా అడగలేదు. వాళ్ల ఎకరం పొలం వాళ్లకివ్వకపోవటం ధర్మం కాదు' అన్నాడు సూరయ్య.

'ఏంది ధర్మం! ఆయన తల్లిని ఆయన దగ్గరుంచుకున్నాడు. అమ్మకు అన్న పెట్టడం ఊరికి ఉపకారం కాదు. పెద్దవాడన్నాక ఉమ్మడి ఖర్చులు పెట్టుకోవాల్సిన బాధ్యత ఆయనదే. మీ అన్నేదో ఘనకార్యం చేసినట్టు మాట్లాడక' అని గోపాలం అన్నాక సూరయ్య నోరువడిపోయింది.

అయితే బాలచంద్ర ఊరుకోలేదు. ఊరు పెత్తందారు వెంకట్రాయుడి దగ్గర తన పినతండ్రి చేసిన అన్యాయం సంగతి ఫిర్యాదు చేశాడు. వెంకట్రాయుడు సూరయ్యను, గోపాలన్ని పిలవనంపాడు. వెంకట్రాయుడు అడిగిన మాటకు సూరయ్య జవాబివ్వలేదు కానీ గోపాలం సమాధానం చెప్పాడు.

## రాజకీయాల్లోకి దిగుతుందా?

**బా**లీవుడ్ నటి రవీనాటండన్‌ను ఈ ఫోటోలో చూడండి. గతంలో ప్రధాని అతల్‌బిహారీవాజ్‌పేయి, కొత్తగా మంత్రి అయిన వినోద్‌ఖన్నా వంటి వారితో తరచూ ఫోటోలు దిగింది రవీన. ఇప్పుడు సమాచారప్రసారశాఖామంత్రిణి శ్రీమతి సుష్మాస్వరాజ్‌తో కలిసి ఆమె వెనుక నిలబడి, ఆమె భుజాల చుట్టూ చేతులు వేసి క్లోజ్‌గా నిలబడి ఫోటో దిగింది. అదీ కాక సమాజ్‌వాదీ నాయకుడు అమర్‌సింగ్‌ను తరచూ కలుస్తుంటుంది. అదేమంటే "ఆయన మా కుటుంబసభ్యుడి లాంటి వారు" అని జవాబిస్తుంటుంది. కొంపదీసి రాజకీయాల్లోకి దిగుతుందేమో అని సందేహం వెలిబుచ్చినవాళ్లతో ఏమందో తెలుసా? "నాకు రాజకీయాల్లో చేరటం కన్నా సమాజసేవ చెయ్యటమే ఇష్టం. మంత్రులను అప్పుడప్పుడూ కలుసుకుంటుండటం నాకు అలవాటు. అంత మాత్రం చేత నేనో రాజకీయనాయకురాలినై పోతాననటం నేనంగీకరించను. నాకస లలాంటి ఉద్దేశమే లేదు" అంటోంది. ఫోటో చూస్తే అట్లాగేమీ లేదనిపిస్తుంది.

ఎన్.



'మావాయునమ్మకేం పొలం లేదండీ. మా వాయువే తల్లి అన్నగారి దగ్గరుంది కదా అని ప్రతియేటా రెండెకరాల పంట ఇచ్చారు. ఇప్పుడు వాళ్లు ఏమేరు రంకు కడ్తున్నారు. అప్పనంగా యేళ్ల తరబడి రెండెకరాలపంట తిన్నది కాక, మా వాటా ఎకరం అంటూ వచ్చారు. వాళ్లకు సిగ్గులేదు అలా అడగటానికి. నాయనమ్మ పేరున పొలమున్నట్లు అలాంటి పత్రమేమన్నా వుంటే చూపెట్టమనండి. అప్పుడు వాళ్లకివ్వాల్సింది ఇస్తాం. అంతేగానీ, ఏదో ఊహించుకుని మాకు ఎకరం పొలం వాటా రావాలంటే కుదరదు.'

అయితే, ఊళ్లో వాళ్లందరికీ తెల్సు మునలమ్మకి రెండెకరాల పొలం కొడుకులిచ్చారని. 'మీకున్న ఆరెకరాలు కాక, అదనంగా రెండెకరాల పొలం సేద్యం చేసుకుంటున్నారే, వాటికేమన్నా పత్రాలుంటే చూపెట్టమనండి' అని వెంకట్రాయుడు అడగలేదు. అతనికి వెంకటేశ్వర్లు, బాలచంద్రల కుటుంబమంటే మంటగా వుంది. అందుకే అతను గోపాలాన్ని నిగ్గదీసి అడగలేదు. చేసేది లేక వెంకటేశ్వర్లు, బాలచంద్ర ఉత్తచేతుల్తో వెళ్లిపోయారు కానీ బాలచంద్ర, గోపాలాల మధ్య గడ్డి వేస్తే బుగ్గయ్యేటట్లుంది పరిస్థితి. నిజానికి లక్ష్మమ్మను కొడుక్కి మంత్రం వేయటానికి పిలవటం గోపాలానికిష్టం లేదు. ఆపద సమయం కనుక తండ్రి పిలుస్తానంటే కాదనలేదు. కొడుకు పోయాక, అందుకు కారణం లక్ష్మమ్మ చేసిన చేతబడే అని నిర్ధారించుకున్న గోపాలం, ఆ కుటుంబంపై ఎలా కసి తీర్చుకోవాలా అని ఆలోచించసాగాడు.

వెంకట్రాయుడికి వెంకటేశ్వర్లు కుటుంబమంటే మంట వుండటానికి కారణముంది. వెంకటేశ్వర్లు కూతురు కృష్ణవేణి పదహారేళ్లవయసులో ఓ మోస్తరు అందంగానే వుంటుంది. అందం కంటే ఆకర్షణ ఆమెలో అపరిమితం. రెండునెల్లుగా ఆమె పట్ల తమకం పెంచుకున్నాడు వెంకట్రాయుడు. ఏ పిల్లయినా అతని దృష్టిలో పడితే, ఏదో విధంగా ఆమెను పక్కలోకి తెచ్చుకోకపోతే నిద్రపట్టేది కాదు వెంకట్రాయుడికి. ఓ రోజు సాయంత్రం అతను పొలానికి వెళ్లి తిరిగి వస్తుంటే, గరువునుండి గడ్డిమోపు ఎత్తుకొస్తున్న కృష్ణవేణి అతనికి కనిపించింది.

'ఏందే పిల్లా, ఏడనుంచేసుకొస్తున్నావు గడ్డిమోపు?' అని సరసంగా అడిగాడు వెంకట్రాయుడు.

'ఏడనుంచేసుకొస్తాను. మా పొలంలోనుండే' అంది కృష్ణవేణి. ఆమె వయసులో చిన్నదే కాని ఊర్లోని యువకులు తనపంక తమకంగా చూడటం ఎరుగును. పల్లెటూరు యువతికనుక తనెంత జాగ్రత్తలో వుండాలో ఆమెకు తెలుసు. అందుకు ఆమెకు తల్లిదండ్రుల సాయం అవసరం లేదు.

చుట్టూ ఎవరూ లేనిది చూసి ఆమె చెయ్యి పట్టుకున్నాడు వెంకట్రాయుడు.

ఆమె అతని చెయ్యి విదిలించికొడ్తూ, గడ్డిమోపులో కొడవలి తీసి, 'నాజోలికొస్తివా, నీకు పరువుదక్కదు. నీకు లొంగే ఆడదాన్ని కాదు' అంది అతన్ని బెదిరిస్తూ.

'హొయ్యే, నీలాంటోళ్లని చాలామందిని చూశాను. నువ్వే దారికి వస్తావు' అని తన దారిపట్టాడు వెంకట్రాయుడు.

కృష్ణవేణి తన్ను తిరస్కరించటమొక్కటే కారణం కాదు వెంకటేశ్వర్లు కుటుంబం మీద అతనికి వైరం పుట్టటానికి. బాలచంద్రకొడుకు, ఇరవయ్యేళ్లవాడు, ఊళ్లో కూలీనాలికి వెళ్లే జనాన్నంతా కూడగట్టుకుని, కూలిరేటు పెంచాడు. ఇదివరకులా కూలిజనం తను ఎంత ఇస్తే అంతకు పనిచేయటం మానేశారు. ఓసారి వెంకట్రాయుడు ప్రసాదును నిలదీశాడు కూడా.

'ఏందిరా, ఊళ్లో ఉండాలని లేదా? కూలిజనాన్ని ఎగేస్తున్నావు, కూలిరేటు పెంచమని' అని.

'ఎన్నాళ్లండీ మరి మీ దొరతనం? మీరేమో మేడలు మిద్దెలు కట్టుకోవాలి, ఎకరాల మీద ఎకరాలు జమచేసుకోవాలి. కూలిజనం అంతరించిపోవాలి. మీ జులుం ఇక చెల్లదు' అన్నాడు దురుసుగా ప్రసాదు.

'కమ్యూనిస్టుల్లో చేరిపోయావట్రా?'

'కమ్యూనిస్టులేంటి. అన్నల్లో కూడా చేరిపోతాను, మీ బుద్ధి మార్చుకోకుంటే'

అన్నల మాట విన్నాక వెంకట్రాయుడికి భయం పట్టుకుంది. ఇంక ప్రసాదు జోలికెళ్లలేదు కానీ, ఆ కుటుంబంపై కచ్చిగట్టాడు. అందుకే అతని దర్బారులో బాలచంద్రకు ఏ న్యాయం జరగలేదు. తన పథకంలో భాగంగా ఆ

## ఆచారా లిలా వుంటాయి!

అమ్మాయిలు వ్యక్తురాళ్లయినప్పుడు, మన దేశంలోనే కాదు, ప్రపంచంలోని అన్నిచోట్లా రకరకాల ఆచారాలు పాటిస్తారు. కొలంబియా, వెనిజులాల్లో అమ్మాయి వ్యక్తురాలు కాగానే, ఐదో రోజు నుంచీ ఐదేళ్ల దాకా వారి సమాజం నుంచి దూరంగా వుంచుతారు. అందరికీ దూరంగా ఓ గుడిసెలో వుంచి, ఓ పరిపక్వమానసికస్థితి వున్న మహిళ ఎట్లా ప్రవర్తించాలో చెప్పటానికి, వారి అమ్మమ్మలను తోడుగా వుంచుతారు. ఇంటి పనులూ, గట్రా సరిచూసుకోగలదనే నమ్మకం కుదిరే వరకూ అక్కడలా వుండాల్సిందే. ఆటు తరువాత అమ్మమ్మా, పిన్నమ్మలూ కలిసి వ్యక్తురాలి శరీరం మీది రోమాలన్నిటినీ తొలగిస్తారు, ఆ అమ్మాయి, బాల్యావస్థ నుంచి యౌవనంలోకి ప్రవేశించిందనే సంగతి ప్రకటించటానికి. తరువాత శుద్ధి కోసం ఆధ్యాత్మికజలాన్ని ఆమె చేత తాగిస్తారు. ఆ రాత్రి ఆరుబయట వెన్నెల్లో హెర్బల్ బాత్-మూలికలు కలిసిన నీటితో స్నానం-చేయిస్తారు. అమ్మమ్మ దాంపత్యసంబంధవిషయాలను ఆమెకు తెలియజేశాక ఆమెను తిరిగి సమాజంలోకి తీసుకుంటున్న సమాచారం అందరికీ తెలిసేందుకు ఓ విందు చేస్తారు. ఆ పైన అమ్మాయికి తగిన వరుని కోసం వేట మొదలవుతుంది.

ఎన్.



కుటుంబం వాళ్లు చేతబడి చేస్తారని ప్రచారం చెయ్యసాగాడు. అతను యథాలాపంగా అన్నమాటకే గోపాలానికి తన పెదనాయన కుటుంబం చేతబడులు ప్రయోగించే కుటుంబమని నిర్ధారణ అయిపోయింది. వెంకట్రాయుడు వేసిన పథకానికి మరో అవకాశం కూడా కలిసివచ్చింది.

వానలు కురవటంతో పొలం పదును చేసుకోటానికి అదే అదననుకునివచ్చిన బాలచంద్ర, పార్వతులకు పక్కపొలం గనిమె తమ వైపు జరిగివుండటం కనిపించింది. పక్కపొలం సీతారామయ్య చేసిన పని వాళ్లకర్థమైంది. సీతారామయ్య భార్య ఆదెమ్మ పొలంలో కన్పించింది.

'ఇదేం పనే మీరు చేసింది? గనిమెను మా పొలంలోకి గదిమారెందుకు?' అనడిగింది పార్వతి.

'మేమేం గదమలేదు. ఎప్పట్లానేవుంది' అని సమాధానమిచ్చింది ఆదెమ్మ.

'తవ్విపోసినట్టు కొత్తమట్టి కన్పట్టల్లా? ఏం జన్మలే మీవి? ఇంత అన్యాయానికి ఒడిగట్టారుగనకే నీ కొడుకు అన్నిరోజులబట్టీ రోగంతో తీసుకుంటున్నాడు'.

దాంతో ఇద్దరికీ మాటామాటా పెరిగింది. జుట్లు పట్టుకుని కలియబడ్డారు. బాలచంద్ర వచ్చి విడతీసినా వాళ్లు మాట్లాడుతూనే వున్నారు.

'దీన్తో ఏంది? పొలం కొలిపిస్తే తెలిసిపోతుంది. మాటలనవసరం' అన్నాడు బాలచంద్ర భార్యతో.

'ఏందిరోయ్. ఒళ్లు కొవ్వెక్కిందా? అదీ ఇదీ అంటున్నావు?' అంది ఆదెమ్మ.

మొగుణ్ణి తిట్టినందుకు పార్వతి కోపానికి పట్టపగ్గాలు లేకుండాపోయాయి.

'ఇంత అన్యాయం చేసే మీరు దుంపనాశనమవుతారు. నీ కొడుకును బొందలో బెట్ట! నీ పాడెగట్ట! నువ్వు ముండమొయ్య!' అని తిట్లకు లంకించుకుంది పార్వతి.

ఆరోజలా కొట్లాటయి ఇంటికి వచ్చిన ఆదెమ్మ ఇంట్లో కొడుకు శవమై కనిపించటంతో పిచ్చిదైపోయింది. అంతకుముందే వెంకటేశ్వర్లు కుటుంబంవాళ్లు చేతబడులు చేస్తారన్న పుకారు వినివున్నది ఆమె. తన కొడుకు చావటానికి కారణం తాము గనిమె జరిపినందుకు కోపంలో వాళ్లు కొడుకుపై ప్రయోగించిన చేతబడే అన్న నిర్ధారణకు వచ్చారు సీతారామయ్య దంపతులు. ఊళ్లో అతిసారవ్యాధితో మరో ఇద్దరు చనిపోయారు. అంతకుముందు గుసగుసలుగా చెప్పుకునే జనం ఇప్పుడు బాహాటంగానే చెప్పుకోసాగారు. వెంకటేశ్వర్లు కుటుంబంవాళ్లు ఎవరు కన్పించినా తప్పుకుపోసాగారు. సీతారామయ్య వచ్చి వెంకట్రాయుడి దగ్గర తనగోడు వెళ్లబోసుకున్నాడు. పార్వతి తన కొడుక్కు చేతబడి చేసిందన్నారు.

'నా కొడుకును బొందలో పెట్టాలని శపించింది ఆ ముం... అట్టాగే అయింది' అన్నాడు సీతారామయ్య.

'అంతే అయివుంటుంది. లేకపోతే మన ఊళ్లో ఇన్ని చావులెప్పుడైనా చూశామా?' అన్నాడు వెంకట్రాయుడు సంతోషిస్తూ, తాపీగా



చుట్టుముట్టించి.

'మరేందండీ మీరు కూడా చూస్తూ ఊరుకుంటారు?'

వీధి అరుగుమీద ఈ సంభాషణ జరుగుతోంది. అటుగా పోతున్న గోపాలాన్ని చూసి పిల్చాడు వెంకట్రాయుడు.

'విన్నావా మీ వాళ్లు చేసిన పని! మీ వాళ్ల చేతబడి ప్రయోగానికి ఇప్పటికి నాలుగుశవాలు లేచాయి ఊళ్లో,' అన్నాడు.

'నా వాళ్లెవరండీ?. నా కొడుకును వాళ్లే చంపారు. అప్పటినుండి మాకు వాళ్లతో మాటల్లేవు. మీరిట్టా చోద్యం చూస్తుంటే లాభం లేదు. పంచాయితీ పెట్టి తీర్మానించాల్సిందే' అన్నాడు గోపాలం.

వెంకట్రాయుడనుకున్నట్టుగానే పావులన్నీ కదిలాయి. పంచాయతీ జరిగింది. వెంకట్రాయుడు రచ్చబండమీద ఆసీనుడయాడు. వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పిలిపించారు. అభియోగాలు మొదలయ్యాయి. ముందుగా నేరం మోపింది గోపాలమే.

'వీళ్లు నా బంధువులని చెప్పుకోటానికే నాకు సిగ్గేస్తున్నది. లక్ష్మమ్మ మంత్రాల మహమ్మారి. నా కొడుకుని చేతబడి చేసి చంపింది. మా నాయనమ్మకు రెండెకరాల పొలముందట. అందులో సగభాగం రావాలని పట్టుబట్టారు. నేనివ్వనన్నాను. అందుకే చేతబడిచేసి చంపారు' అన్నాడు గోపాలం ఆవేశంగా.

'నా కొడుకునూ ఆళ్లే చంపారు. దాన్నోరువడిపోను. పార్వతి నా కొడుకు చావాలని బట్టింది. ఏం మంత్రం వేసిందో సందాళకల్లా నా కొడుకు రక్తం కక్కుకు చచ్చాడు' అని చెప్పింది ఆదెమ్మ.

బాలచంద్ర వాదించాడు, తమకేం తెలియదని. వెంకటేశ్వర్లు ప్రార్థించాడు, తమపై అలాంటి నీలాపనింద మోపవద్దని. ప్రసాదు కోపంలో ఊగిపోయాడు, కూలిజనాన్ని కూడగట్టినందుకు వెంకట్రాయుడు తమపై అలా కక్ష సాధిస్తున్నాడని. కృష్ణవేణి నిప్పులు కురిపిస్తూ రాయుడువంక చూసింది కానీ ఏం మాట్లాడలేదు. లక్ష్మమ్మ తను చేసిన పొరపాటేమిటో తెలియక నివ్వెరపోయి చూస్తున్నది, పార్వతి ఇంత ఘాతుకమైన ఆరోపణా అని అవాక్కయి నిలబడింది. ఎనిమిదేళ్ల భాగ్యలక్ష్మికి ఏం జరుగుతుందో అర్థం కాక, సూరయ్యను చూసి, 'తాతా!' అని ఆయన దగ్గరికి రాబోయింది. ఆయన ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

వెంకటేశ్వర్లు కుటుంబం వాళ్లు చేతబళ్లు చేస్తున్నారన్న నిర్ధారణ చేసింది పంచాయతీ. వెంకట్రాయుడి తొత్తులు వీళ్లను బతకనివ్వటానికి వీల్లేదు, సజీవదహనం చెయ్యాలన్నారు. కొంతమంది చెట్టుకు కట్టి కొట్టాలన్నారు. గుండు గొరిగించి నగ్నంగా

వీధుల్లో తిప్పాలన్నారు, కొంతమంది అహింసావాదులు.

చివరకు వెంకట్రాయుడు-- 'మీ ఆగ్రహం వాకర్థమైంది. వాళ్లు దుష్టులు, మన ఊళ్లో వుండాల్సిన వాళ్లు కారు. అయితే, నేను [illegible] పేరన్నవేవీ చేయటం [illegible] తప్పుకు ఇవాల్టినుండి [illegible] ఇవాల్టినుండీ వాళ్లతో [illegible] ఎవరూ ఏ సాయమూ [illegible] మంచినీళ్లు కూడా ఇవ్వకూడదు, [illegible] అమ్మకూడదు, [illegible] వ్యం ఆడించరాదు. [illegible] వాళ్ల పాపాన వాళ్లేపోతారు. [illegible] వాళ్లంతా ఒక్కొక్కళ్లే వచ్చి [illegible] వెళ్లండి. అది చాలు శిక్ష. ముందు వాళ్లందర్నీ చెట్టుకు కట్టేయండి.'

వెంకట్రాయుడి ఆదేశంపై వాళ్లను చెట్టుకట్టేశాక, ఊయటానికి ముందుకొచ్చింది గోపాలం. బాలచంద్ర ముఖంమీద ఊస్తూ, 'తూ' అని వెళ్లిపోయాడు. సీతారామయ్య వెంకటేశ్వర్లు ముఖం మీద ఊశాడు. ఆదెమ్మ పార్వతి ముఖంమీద ఊసింది. ఊళ్లో జనం వాళ్లలో ఎవరిమీద కోపం వుంటే వాళ్లమీద ఊశారు. చివరగా వచ్చిన వెంకట్రాయుడు కృష్ణవేణి, ప్రసాదులవంక చూసి వంకర నవ్వు నవ్వుతూ, 'నాతో పెట్టుకుంటే ఏమవుతుందో తెలిసిందా? రంకు ము...! నిన్నింతటితో వదుల్తాననుకోకు. ఏరా నాయనా, కమ్యూనిస్టోడివా నువ్వు, అన్నల్తో కేరతావా? వెళ్లు.... ఇప్పుడు చేరు. మీ బతుకులిడ్డా. థూ థూ' అని వాళ్లిద్దరిమీదా ఊసి వెళ్లాడు.

ఈ కార్యక్రమమంతా జరుగుతూ వుంటే మారయ్య ముఖం మీద చేతులుంచుకుని ఏడుస్తూ నేలకూలబడిపోయాడు. వాళ్లనలా చెట్టుకు బంధించి ఊరిజనమంతా వెళ్లిపోయారు. ఇంకా అలాగే నేలబడి పొర్లి ఏడుస్తున్న మారయ్యను చూసి, 'రా, చిన్నాయనా! నీ పని కూడా కానీ' అని పిల్చాడు వెంకటేశ్వర్లు.


మారయ్య ఏం మాట్లాడకుండా లేచాడు. కాళ్లీడ్చుస్తూ వచ్చాడు. కట్లు విప్పి చెట్టుకు కట్టేసిన వాళ్లని విడిపించాడు. 'వెళ్లండి నాయనా, వెళ్లండి. నేను ధృతరాష్ట్రుణ్ణి. మీరంతా ఉమ్మేసినా నా పాపం ప్రక్షాళన కాదు' అని చెప్పి మెల్లగా నడుచుకుంటూ వెళ్లిపోయాడు. ఆ తరువాత ఆయన రెండు నెలలకంటే బతకలేదు.

సంఘ బహిష్కరణతో వెంకటేశ్వర్లు కుటుంబపు బతుకు దుర్భరమైంది. వెలికి గురయిన మొదటి నెలరోజుల్లో దిగ్భ్రాంతులయిన వాళ్లకు ఏం చేయాలో తోచలేదు. వెలికంటే అధికంగా పంచాయతీలో జరిగిన అవమానం ప్రసాదును ఎక్కువగా బాధించసాగింది. ఓసారి మట్టువాడ వెళ్లొచ్చిన ప్రసాదు తండ్రిలో అన్నాడు: 'నిన్న మట్టువాడ వెళ్లినప్పుడు నా స్నేహితుడు చిరంజీవిని కలిశాను. ఊళ్లోవాళ్లు మనల్ని వెలివేసిన సంగతి చెప్పాను. వాళ్ల నాన్న మట్టువాడ పోలీసు సబిన్స్పెక్టరు. వాడు నన్నాయన దగ్గరకు తీసుకెళ్లాడు. ఆయన పేరు ఆనందరావు. నేను చెప్పిందంతా విని ఆయనన్నారు: 'రెండే ఆల్టర్నేటివ్‌లు వున్నాయయ్యా ఈ పరిస్థితుల్లో. ఒకటి ఏదో విధంగా వాళ్లతో రాజీ చేసుకోవటం. రెండు కేసు పెట్టటం. ఐ పి సి 339 కింద 'రాంగ్ ఫుల్ రెస్ట్రెయింట్' అని కేసు పెట్టవచ్చు. ఐ పి సి 503 కింద 'క్రిమినల్ ఇన్టిమిడేషన్' అని కేసు పెట్టవచ్చు. ఏ వ్యక్తికి, వ్యక్తులకైనా కీడు చేద్దామనే దురుద్దేశంతో ఆ వ్యక్తిని, వ్యక్తులను గాయపరిచినా, అప్రతిష్టపాలుచేసినా, ఆస్తి నష్టం కలిగించినా అంటే లీగల్‌గా ఆ వ్యక్తి, వ్యక్తులు ఏవయితే అనుభవించవచ్చో, అలా అనుభవించనివ్వకుండా అడ్డంకి కలిగించినా, బెదిరించినా సదరు వ్యక్తిని, వ్యక్తులను ఈ సెక్షన్ కింద బుక్ చేయవచ్చు. అందువల్ల కష్టాలు పెరగవచ్చు. ఆలోచించు. మీ పెద్దవాళ్లతో కూడా చర్చించు. మీ ఊరి పెత్తందారు వెంకట్రాయుడు నాకు తెల్సు. రాజకీయపు వత్తిడి తేవచ్చు. నువ్వు మా అబ్బాయి స్నేహితుడివి. పదేళ్ల బట్టీ నిన్ను చూస్తున్నాను. లేకపోతే ఇన్ని మాటలు చెప్పాల్సిన అవసరం నాకు లేదు' అన్నాడు.

ఈ పోలీసు వాళ్లని నమ్మటానికి వీల్లేదురా. డబ్బు వదల్చుకోవటమే కాని పనవుతుందనుకోను' అన్నాడు బాలచంద్ర.

'మన ఇంటా వంటా లేదు పోలీసు కేసులు పెట్టటం, కోర్టుల కెక్కటం, ఆయనన్నట్టు మరింత కష్టాలు పెరగటం తప్ప ప్రయోజనమేం వుండదు' అన్నాడు వెంకటేశ్వర్లు.

'మనం చేతులు ముడుచుక్కూర్చుంటే వాళ్లు మరింత పేట్రేగి పోతారు, పెదనాయనా' అన్నాడు ప్రసాదు.



## అభిమానుల ముచ్చట తీర్చాడు

అభిమానులను నిలుపుకోవాలంటే వారు చెప్పినట్లుగా చేయవలసివుంటుంది, ఎవరికైనా సరే. దీనికి ప్రఖ్యాతగాయకుడు మైకేల్ జాక్సన్ అతీతుడేమీ కాదు. మామూలుగానైతే పిల్లలను బయటికి తీసుకొచ్చేటప్పుడు, ముసుగు వేసి ఎవరికీ కనిపించకుండా తీసుకొచ్చేవాడట. కానీ ఓ సారి అభిమానులు వీరలెవెల్లో రెచ్చిపోయి తమకు మైకేల్ కొడుకును చూడాలనుందని పెద్దపెట్టున కోలాహలం చేసేసరికి, వారి కోరికను అంగీకరించక తప్పలేదు. అందుకని ఏం చేశాడంటే, తాను వుంటున్న హోటల్ నాలుగో అంతస్తు నించి తమ తొమ్మిది నెలల బాబు, ప్రిన్స్ మైకేల్‌ను కిందికి వేలాడదీశాట్ట, జనమందరూ చక్కగా చూసేందుకు. అటు తరువాత బెర్లిన్‌లోనూ అభిమానుల కోరిక మీద తన కూతురి ముఖాన్ని చూపేందుకు, ఆమెనూ బాల్కనీ నుంచి కిందికి వేలాడదీశాట్ట. మైకేల్‌కు అభిమానుల పట్ల వున్న అభిమానాన్ని మెచ్చుకోవలసిందే!

ఎస్.

'వాడు చెప్పిందీ నిజమే. సీతారామయ్య పొలం గనిమె గదిమేశాడు. వాడు ఇంకా గనిమె జరిపినా, మన పొలం అంతా కాజేసినా మనమేం చెయ్యలేం. మనకు ఎవరు న్యాయం చేస్తారు. కేసు పెడ్దాం. ఇప్పుడున్న పరిస్థితులకంటే ముంచుకు పోయేదేం వుండదు' అన్నాడు బాలచంద్ర.

'సరే, మీ ఇష్టం' అన్నాడు వెంకటేశ్వర్లు.

ముగింపు వచ్చేవారం

కథ

# పోలీసు పంచాయితీ

## కాకాని చక్రపాణి

(గత సంచిక తరువాయి)

**బా**లచంద్ర, ప్రసాదు మట్టువాడ వెళ్లి పోలీసు స్టేషనులో కంప్లయింట్ యిచ్చారు. సబిన్స్పెక్టరు ఆనందరావు వెంకట్రాయుడికి కబురంపాడు. ఓ సారి వచ్చి కలిసి వెళ్లమని. వెంకట్రాయుడు రాగానే చెప్పాడు, 'వెంకటేశ్వర్లు కుటుంబాన్ని మీరు వెలివేశారు. వాళ్లు కంప్లయింట్ ఇచ్చారు.కేసులో ముఖ్యులయినవాళ్లని అరెస్టు చెయ్యక నాకు తప్పదు. రేపొచ్చి వాళ్లనందర్నీ అరెస్ట్ చేస్తారు.

మీరు ఇక్కడే మాకు లొంగిపోండి. లాయర్ని కలిసి బెయిలుకు అప్లయి చేసుకోండి. మీరు తెలిసినవాళ్లు, పెద్ద మనుషులు కనుక ముందుగా ఇన్ఫర్మేషన్ ఇవ్వటం నా బాధ్యత అనిపించింది. అందుకే కబురంపాను' అని.

వెంకట్రాయుడు వెంటనే వెళ్లి లాయర్ని కలిశాడు. బెయిలు ప్రయత్నం చెయ్యమన్నాడు. ఊళ్లోకి వచ్చి గోపాలాన్నీ, సీతారామయ్యను మరో పదిమంది ముఖ్య పాత్రధారులనందర్నీ సమావేశపర్చి పరిస్థితిని వివరించాడు. కోర్టులో బెయిల్‌కు అప్లయి చెయ్యాలి. లాయరుకు డబ్బివ్వాలి, కోర్టు ఫీజులు కట్టాలి పోలీసులకు లంచాలు ఇవ్వాలి, కేసు నడిపించాలి కనుక ముందుగా తలా పదిహేనొందలూ పట్టుకురమ్మని చెప్పాడు, డబ్బు లేదన్న వాళ్లకి తనే అప్పుపెట్టాడు. పద్దెనిమిది వేలు వసూలు చేశాడు. మర్నాడు గోపాలం, సీతారామయ్యలతో సహా మరో పదిమందిని అరెస్టు చేసి మట్టువాడ పోలీస్ స్టేషన్ లాకప్‌లో పెట్టాడు సబిన్స్పెక్టరు. వెంకట్రాయుడు వచ్చి తనే లొంగిపోయాడు. మరో అరగంటలో బెయిల్ పత్రంతో లాయరు హాజరయ్యాడు. అందరూ బెయిల్ మీద విడుదలయ్యారు.

కోర్టులో కేసు మెల్లగా నడుస్తున్నది. అటు వెంకటేశ్వర్లుకీ, ఇటు వెంకట్రాయుడి పక్షానికీ డబ్బు నీళ్లలా ఖర్చవుతున్నది. డబ్బు లేక, ఊళ్లో అప్పిచ్చేవాళ్లెవరూ లేకా నానా ఇబ్బందయింది. వెంకటేశ్వర్లు, బాలచంద్రలకు. బాలచంద్ర వెళ్లి ఆనందరావుతో మొత్తుకుంటే ఆయనే సాయం చేశారు. మట్టువాడలో ఓ ఆసామికి వాళ్ల పొలం ఎకరం లక్షరూపాయలు ఖరీదు చేసేదాన్ని డెబ్భై ఐదువేలకు అమ్మించిపెట్టి ఆదుకున్నాడు. కేసు నడిపించటానికి రెండు మూడు నెలలకోసారి కేసులున్న పన్నెండుమంది దగ్గరా వెయ్యో, పదిహేనువందలో వసూలు చేస్తూనే వున్నాడు వెంకట్రాయుడు. వెంకట్రాయుడి జేబు బరువును లాయరూ, పోలీసులూ పంచుకుంటూ అతనికి సాయం చేశారు. ఇరు పార్టీల వారికీ పొలం పన్లు చెడిపోతున్నాయి. వెంకట్రాయుడికే విసుగేసింది. అయితే, ఎంత తాను రాజీకి ప్రయత్నిస్తే వెంకటేశ్వర్లు వర్గం క[illegible]క్కి కూచుంటుంది. అందుకే సబిన్స్పెక్టరు ఆనందరావుకు చెప్పాడు, రాజీ కుదర్చమని. ఆనందరావు రాజీ ప్రస్తావన తెచ్చినప్పుడు ప్రసాదు అందుకు విముఖత చూపాడు కానీ, వెంకటేశ్వర్లు, బాలచంద్ర ఏదో విధంగా కేసునుండి బయట పడదామన్నారు. సంఘ




బహిష్కరణ కంటే కోర్టు కేసు వాళ్లని మరింత బాధించింది. చివరకు ఇరువర్గాలవారినీ సమావేశపరిచి, మట్టువాడ పోలీసు స్టేషనులో పోలీసు పంచాయతీ జరిపించాడు సబిన్స్పెక్టరు ఆనందరావు.

'సరేనండీ. ఎస్సయ్‌గారూ, మీరు చెప్తున్నారు కనుక మేం వెలి ఎత్తివేస్తాం. అందుకు కొన్ని షరతులు వున్నాయి. వాటికి వాళ్లు అంగీకరిస్తే వాళ్లని మాలో కలుపుకోవటానికి మాకేం అభ్యంతరం లేదు' అన్నారు వెంకట్రాయుడు.

'ఏమిటో ఆ షరతులు?' అనడిగాడు బాలచంద్ర.

'ముందుగా మా పై కేసులు ఎత్తేసుకోవాలి. రెండు మాకు డబ్బు ఖర్చయింది. కోర్టుల చుట్టూ తిరగటమైంది. అందుకు లక్షరూపాయలివ్వాలి. మూడు కృష్ణవేణిని 'బసివి' ని చెయ్యాలి. నాలుగు ప్రసాదు ఊళ్లో వుండటానికి వీల్లేదు.'

కృష్ణవేణిని 'బసివి' చెయ్యాలనేటప్పటికి ఆగ్రహంతో ఊగిపోయాడు ప్రసాదు. అయితే, అతను తన ఆగ్రహాన్ని వ్యక్తీకరించే అవకాశం లేకుండానే గోపాలం చిర్రెత్తినట్టు అరిచాడు: 'కృష్ణవేణిని 'బసివి' ని చెయ్యాలని మేం అన్నామా? నువ్వేదో దురుద్దేశంతో మాట్లాడుతున్నావు, రాయుడూ. మా ఇంటి పిల్లను గురించి నువ్వేం మాట్లాడినా నేను సహించను' అని.



'అదేంటి అట్లా అంటావు. లక్ష్మమ్మ చేతబడి చేసి నీ కొడుకుని చంపింది. అందుకు దాని కూతురుకు శిక్షపడాలి. ఆ ముం... కి పొగరు. ఊరిపెద్దను నేనంటేనే దానికి లెక్కలేదు. అందుకే, దాన్ని 'బసివి'ని చెయ్యాలంటున్నాను. ఊరంతటికీ రండవుతుంది అప్పుడు. అదే ఆ కుటుంబానికి మనం విధించే శిక్ష' అన్నాడు రాయుడు.

'చెప్పు తీసుక్కొడతా, నా కొడకా, మళ్లీ ఆ మాట అన్నావంటే, ఊళ్లో ఆడవాళ్లంతా నీకు ముం... లు, రండలట్రా'. ఆస్తి తగాదాలుండొచ్చు. కోపాలుండొచ్చు. కానీ, అది నా కూతుర్లాంటిది. దాన్ని గురించి ఇంకొక్కమాట అన్నా నేను ఊర్కోను. ఇప్పుడు నాకు అర్థమవుతోంది నీ కపటం. దానిమీద నీ కన్నుపడింది. అది నిన్ను కాదనేసరికి, చేతబడి అని ప్రచారం చేశావు. కోర్టు కేసులని మా డబ్బు తిన్నావు. నువ్వేం ఊరిపెద్దవురా నా కొడకా. ఊరి భక్షకుడివి' అంటూ కోపంతో ఊగిపోయాడు గోపాలం.

'ఇదుగో నోరు సంభాళించుకు మాట్లాడు. ఇది పోలీసు స్టేషనయింది కనక బతికిపోయావు. లేకపోతే....

లేకపోతే ఏం జేస్తావు? ఏం చేస్తావో చెయ్, చూద్దాం అని చెప్పు తీసుకు లేచాడు గోపాలం.

సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆనందరావుకు అతన్ని శాంతపరిచేటప్పటికి చచ్చిన చావు అయింది.

ఇదిగో, రాయుడూ, నువ్వు మళ్లీ పాత పంథాలోనే పోతున్నావు. ఏ ఆడకూతుర్నీ బసివిని చేయటానికి చట్టం ఒప్పుకోదు. ఆ షరతు

పెట్టినందుకే నిన్ను అరెస్టు చేయవలసి ఉంది. నువ్వు పెట్టిన నాలుగో షరతు కూడా చెల్లదు. ఎవరు ఊళ్లో ఉండాలీ, ఎవరు ఉండకూడదూ అని నిర్ణయించే అధికారం నీకు లేదు. కనుక మొదటి రెండు షరతుల గురించి మాట్లాడండి అన్నాడు ఆనందరావు.

అయితే మాకీ రాజీ అవసరం లేదు అంటూ లేచాడు వెంకట్రాయుడు.

మీరు కూర్చోండి, రాజీ అవసరం లేదంటే కోర్టు కేసు నడుస్తుంది. అంటే మేము డబ్బు ఖర్చుపెట్టాలి. మా వల్ల కాదు. మీరు రాజీ పడకపోయినా మేము రాజీపడతాం. మేము ఖర్చుపెట్టిన డబ్బు మాకొస్తే చాలు అన్నాడు సీతారామయ్య

వెంకట్రాయుడికి దిక్కు తోచలేదు. మిగిలిన పరువు ఏమైనా కాపాడుకోవాలనుకుంటే, తనూ రాజీకి రావలసిందే. అందుకే ఏమీ మాట్లాడకుండా కూర్చున్నాడు. మొదటి రెండు షరతుల గురించి చర్చ జరిగింది.

'కోర్టు కేసు ఉపసంహరించు కోవటానికి మాకేం అభ్యంతరం లేదు. లక్ష రూపాయలు కట్టాలంటే మాత్రం మా వల్ల కాదు. మీరే కాదు డబ్బు ఖర్చుపెట్టింది. మేమూ ఖర్చుపెట్టాం....' అన్నాడు బాలచంద్ర.

'అర్థమైందిగా, ఎస్సైగారూ. 'చేతబడి' అన్నది ప్రచారమని తేలిపోయింది. దురుద్దేశంతో, కరుడుగట్టిన స్వార్థంతో ఓ కుటుంబాన్ని శిక్షించటానికి వేసిన పథకమని అర్థమయిపోయింది. సరే, మీరు పెట్టిన ఖర్చులకింద మేం లక్షరూపాయలు ఇస్తాం. మీరు మామీద దుష్ప్రచారం చేశారు, వెలివేసి హింసించారు. మా మొహాలమీద ఉమ్మేసి అవమానించారు. అందుకు మీకేం శిక్ష లేదా? అందుకు తప్పుకింద మీరు మాకు రెండు లక్షలు చెల్లించండి' అన్నాడు ప్రసాదు.

'ఊఁ మాట్లాడు, గోపాలం. ఆ నాకొడుకు మనకు జుర్మానా వేస్తాడంట. కట్టు, రెండు లక్షలు ఎక్కడ నుంచి తెచ్చి కడ్తావో. చేతబడి చెయ్యలేదన్నది తేలిపోయిందంట. మరి ఊళ్లో పిల్లగాళ్లు ఎందుకు చచ్చిపొయ్యారు?' అన్నాడు వెంకట్రాయుడు.

'మందులేక చచ్చిపోయారు. వైద్యంలేక చచ్చిపోయారు. ఊరిజనానికి అక్షరాస్యత అంటక చచ్చిపొయ్యారు. ఊరిజనానికి విజ్ఞాన వికాసాలు కలిగించనివ్వని నీ పెత్తందారీతనం వల్ల చచ్చిపొయ్యారు.'

'ఈ నగ్జలైటు నా కొడుకుని ఇలా మాట్లాడనిస్తూనే వుంటారా, మీరు, ఎస్సైగారూ. మీ ఎదుటే వీడింతగా నన్ను అవమానిస్తుంటే మీరు పట్టించుకోవటం లేదు' అని ఫిర్యాదు చేశాడు వెంకట్రాయుడు ఎస్సైతో.

అలా అనంగానే ప్రసాదు లేచి, 'థూ' అని వెంకట్రాయుడి ముఖం మీద ఊశాడు.

'ఏయ్, ప్రసాదూ, ఏంటి నువ్వు చేసిన పని? పోలీసు స్టేషనులోనే...' అని సబిన్స్పెక్టరు అంటూండగానే, 'ఆయనకు అవమానమంటే ఎలా వుంటుందో రుచి చూపించటానికే అలా చేశాను కానీ మరోకందుకు కాదు.

'వాడు' 'వాడు' 'నగ్జలైటు', అని నన్నునే అధికారం ఆయనకెవరిచ్చారండీ. ఎవరూ చేసినా తప్పు తప్పే. పెద్దలు మీరు, పెద్ద హృదయం చేసుకుని నన్ను క్షమించేయండి, రాయుడుగారూ' అన్నాడు ప్రసాదు, లేచి తన జేబురుమాలుతో అతని ముఖం మీద ఉమ్మి తుడుస్తూ.

'ఛ.... ఛ..... పరువుపోయాక నేనిక్కడుండను' అని లేచాడు ఆగ్రహంతో వెంకట్రాయుడు.

'క్షమించమన్నాడు కదండీ. అయినా మీరు చేసిన తప్పు కంటే' ఆ పిల్లవాడు పెద్ద తప్పేం చేయలేదుగా' అని బతిమలాడి అతన్ని కూర్చోబెట్టాడు సబిన్స్పెక్టరు.

'ఇందులో మేం చేసిన తప్పేం లేదండీ. వాళ్లు చేతబడి చేసింది ఖాయం. వాళ్లు లక్షరూపాయలు ఖర్చులకుగాను చెల్లించేటట్టుంటే మాలో కలుపుకుంటాం. లేకపోతే లేదు' అన్నాడు వెంకట్రాయుడి మద్దతుదారు వీర[illegible].

లక్షరూపాయలు చెల్లింపు విషయంలో రెండు బృందాల మధ్య వాగ్వివాదం ఓ అరగంట నడిచింది. ఈ లోపల రెండు బృందాలూ రాజీ వద్దని వాకవుట్ చేయ ప్రయత్నించాయి. సబిన్స్పెక్టరు ఆనందరావు చివరకు విడివిడిగా రెండు బృందాలతోనూ మాట్లాడాడు. 'లక్షరూపాయలు కాదు గానీ, ఓ యాభై వేలకు నేను వాళ్లని ఒప్పిస్తాను. కేసులో మీరు గెలవవచ్చు. దానికి మరింకో రెండేళ్లు పట్టవచ్చు. ఇప్పటికే ఓ ఎకరం అమ్మారు. మరో ఎకరం అమ్మాల్సి రావచ్చు. ఈ లోపల వెలివల్ల మీరు పడే బాధలు ఎన్నో వున్నాయి. కనుక నా మాటవిని మీరు యాభైవేలకు ఒప్పుకోండి' అని నచ్చజెప్పాడు ఎస్సై వెంకటేశ్వర్లు బృందానికి. వెంకటేశ్వర్లు అంగీకరించాడు కానీ, బాలచంద్ర, ప్రసాదు తేలిగ్గా ఒప్పుకోలేదు. 'అమ్మాయికి పెళ్లి కావాలి. కోర్టు కేసు ఎప్పుడు తేలుతుందో ఎవరూ చెప్పలేరు. అంతకాలం పిల్లకు పెళ్లిచేయకుండా వుంటారా? ఈ కేసు నడుస్తున్నంతకాలం వెలిలో వున్న మీ పిల్లను పెళ్లి చేసుకోటానికి ఎవరు ముందుకు వస్తారు' అని ఆఖరి బాణం వదిలాడు ఎస్సై. దాంతో బాలచంద్ర, ప్రసాదులు ఒప్పుకోక తప్పలేదు.

## బిపాశకు జాన్ అబ్రహాం ఖితాబు

ఇటీవల విడుదలై సుమారుగా నడుస్తున్న 'జిస్మ్' (శరీరం) చిత్రంలో బిపాశాబసు, తన బాయ్‌ఫ్రెండ్‌తో పేట్రేగిపోయి నటించిన సంగతి అరిదరికీ తెలుసు. ఈ చిత్రం చూసిన బిపాశ మరో బాయ్‌ఫ్రెండ్ జాన్ అబ్రహాం, ఆమెను పొగిడాడు. జాన్ కూడా మోడల్‌గా వుంటూ బాలీవుడ్‌లోకి ప్రవేశించాడు. తమాషాగా జాన్‌కు లభించినవన్నీ సోలో హీరోల ప్రాజెక్టులే. 'జిస్మ్' గురించి చెబుతూ, "బిపాశ చాలా అందమైన అమ్మాయి. నేను సాధారణంగా అమ్మాయిలను గౌరవిస్తుంటాను. ఆమె అందరి కంటే ఎక్కువ క్లోజ్‌గా నాకు తెలుసు. స్వీట్‌గా వుండటంతో పాటు సహాయమూ చేస్తుంది. నేను రంగానికి కొత్తవాణ్ని తెలిసి డైలాగులు చెప్పటంలోనూ, ఇతరవిషయాల్లోనూ ఆదుకుంది" అన్నాడు జాన్. ఎంతైనా తన గర్ల్ ఫ్రెండ్, ఆమెను కాకపోతే మరొకరిని పొగుడుతాడా?

ఎస్.



'మీరు అనవసరపు పట్టుకు పోకండి. రెండేళ్లలాగో వాళ్లు వెలిగానే బతికారు. మరో రెండేళ్లు బతుకుతారు. అలవాటయింది కనుక వాళ్లకు కష్టం లేదు. కేసు తీర్పయితే మీకు శిక్షపడటం ఖాయం కనుక నేను చెప్పేదేమిటంటే వాళ్లు యాభై వేలు ఇచ్చేట్టు నేను వాళ్లని ఒప్పిస్తాను. మీరు అంగీకరించండి. లేదూ అంటే యాభై వేలు రాకపోగా, ఇంకా మీరు డబ్బు ఖర్చు పెట్టాలి, కోర్టు చుట్టూ తిరగాలి. చివరకు కనీసం రెండేళ్లయినా జైలు కూడు తినాలి' అని చెప్పాడు ఎస్సై వెంకట్రాయుడి వర్గానికి.

ఎస్సై చెప్పిన మాటలకు అంగీకరించక తప్పలేదు. కేసు విషయంలో తమ లాయరు భరోసాగా చెప్పలేదు. పైగా తన వర్గంలో వాళ్లెవరూ ఇంక పైసా ఖర్చుపెట్టడానికి సుముఖంగా లేరు. అందులో కొంతమంది గోపాలం లాంటివాళ్లు ప్రత్యర్థి వర్గం వైపు తిరిగిపోయేట్టున్నారు. అందుకే 'సరే' అన్నాడు వెంకట్రాయుడు.

'ఇంకోమాట'. వాళ్లిచ్చే యాభైలో మీకు ముట్టేది నలభయ్యే. మిగతా పది మా ఖర్చులకు' అన్నాడు ఎస్సై ఆనందరావు.

పోలీసులను తృప్తిపరచకపోతే అనవసరపు చిక్కుల్లో పడాల్సి వస్తుందని తెల్సు వెంకట్రాయుడి వర్గానికి. మరేం మాట్లాడకుండా అందుకంగీకరించారు వాళ్లు.

అలా ఎస్సై ఆనందరావు విజయవంతంగా నడిపించాడు పోలీసు పంచాయితీ. రాజీ పత్రం తయారయింది. వెంకటేశ్వర్లు బృందం కేసు ఖర్చులకింద యాభైవేలు చెల్లించటానికీ, యాభై వేలు స్వీకరించి వెలి నెత్తివేసి వాళ్లను గ్రామంలో కలుపుకోటానికీ అంగీకరిస్తూ ఇరువర్గాలు సంతకాలు చేశాయి. సాక్షి సంతకాలకోసం ఊళ్లో పెద్దమనుషుల్ని ఇద్దర్ని పిలిచారు. రెండురోజుల్లో తనే డబ్బు వసూలుచేసి ఇస్తానని చెప్పాడు ఎస్సై వెంకట్రాయుడికి. రాజీ పత్రం మాత్రం తన దగ్గరనే వుంటుంది, మళ్లీ పేచీలు రాకుండా. వెంకటేశ్వర్లు వర్గం కేసును ఎత్తివేసుకుంటున్నట్లు, అందుకు కోర్టువారి అనుమతి కోరుతూ అభ్యర్థన పత్రం రాసి ఎస్సైకి ఇచ్చారు.

అలా రాజీ జరిగి, ఇరు వర్గాలూ వెళ్లిపోయాక, ఇదంతా చూస్తున్న ఓ పత్రికావిలేఖరి అడిగాడు ఎస్సై ఆనందరావును: 'భలే పంచాయితీనండీ మీది! వెంకటేశ్వర్లు వర్గం వాళ్లు రెండేళ్లుగా సంఘ బహిష్కరణకు గురై నానా ఇబ్బందులూ పడ్డారు. చేతబడి చేస్తున్నారన్న అపవాదుకు గురై అంతులేని మానసికవేదన అనుభవించారు, అవమానాల పాలయ్యారు. 'అయ్యా, మాకు న్యాయం చేయండి' అని మిమ్మల్ని అర్థించే వాళ్లకే యాభైవేల రూపాయలు జరిమానా ఖర్చుల పేరుతో విధించి, నిందితులకు బహుమానంగా ఇప్పించారు. సెభాష్! మీ పోలీసు పంచాయితీతో ఓ చరిత్ర సృష్టించారు' అని.

ఆనందరావు నవ్వాడు. 'ఆఫ్ ది రికార్డంటే ఓ మాట చెప్తాను. లేకపోతే నోరు మెదపను' అన్నాడు.

'చెప్పండి' అన్నాడు విలేఖరి.

'చేతబడులు, బాణామతులు అంటూ గ్రామ ప్రాంతాల్లో ఎప్పటి నుండో వ్యాప్తిలో వున్న మూఢనమ్మకాలు ఇప్పటికీ సజీవంగానే వున్నాయి. బాణామతిని అదుపుచేయటానికి నిజాం ప్రభుత్వంలో 'బాణామతి ఇన్స్పెక్టర్లు' వుండేవాళ్లు. ప్రభుత్వం జనంలో చైతన్యం కలిగించాలి. మూఢనమ్మకాలు పారదోలాలి. అందుకు అక్షరాస్యత పెంచాలి. ఆ పనులేవీ ఏ ప్రభుత్వం చేపట్టటం లేదు. వాళ్లకు రాజకీయ కుమ్ములాటల్తోనే సరిపోతోంది. మేము పోలీసులం మా చేతనైన పద్ధతిలో శాంతి భద్రతలు నెలకొల్పటానికి ప్రయత్నిస్తున్నాం. కొంతమంది నష్టపోవచ్చు. కానీ, ఆ తర్వాత వాళ్లు ప్రశాంతంగా బతికే అవకాశం వుంటుంది. అందుకే పోలీసు పంచాయితీ నిర్వహించాం. ఇరు వర్గాలూ ఓ పద్ధతిన రాజీకి వచ్చేట్టు చేశాం.'

'మరి ఆన్ ది రికార్డ్ మాటేమిటి?'

'మేం ఎలాంటి పోలీసు పంచాయితీ నిర్వహించలేదు. ఇరువర్గాలు చేసుకున్న రాజీతో మాకు సంబంధం లేదు. అది వాళ్లు బయట కుదుర్చుకున్నది మాత్రమే. అందుకు మా పోలీసుల్లో ఎవరూ సాక్షులు కారు. వివాదంతో కొట్టుకు ఛస్తున్న రెండు వర్గాలు రాజీకి వస్తే మా కభ్యంతరం లేదు. మాకు కావల్సింది శాంతి భద్రతలు.'

'మరి న్యాయం జరగదన్న మాట అన్యాయానికి గురయిన వర్గానికి?'

'మళ్ళీ ఆఫ్ ద రికార్డ్. అసలు న్యాయం ఎక్కడుంది? బలవంతుడి దగ్గరుంది. వెంకట్రాయుడి వర్గానికి బలం వుంది. జైలు శిక్షలపాలయినా వాళ్లు మరింత కక్ష పెంచుకుంటారు కానీ వెంకటేశ్వర్లు వర్గాన్ని హాయిగా బతకనివ్వరు. రాజ్యాంగ చట్టపరంగా సంక్రమించిన అధికారాలతో పోలీసులకు బలం వుంది. అందువల్ల మాకు లాభసాటయిన వర్గాన్ని ఎంచుకుని, రెండో వర్గానికి కూడా మరింత దురన్యాయం చేయకుండా, మాకు తోచిన తీర్పిచ్చాం. అందుకు ఇరు వర్గాలూ అంగీకరించేట్టు చేశాం. తీర్పుని అమలు పర్చే శక్తి కూడా మాకు వుంది. కనుక 'పోలీసు పంచాయితీ' అని మీరు పత్రికల్లో రాసినా మా కొచ్చే నష్టం లేదు, మీకు వచ్చే లాభం లేదు. ఎందుకంటే, ఏదీ మీరు ప్రూవు చేయలేరు కనుక' అన్నాడు పోలీసు ఇన్స్పెక్టరు ఆనందరావు.

(అయిపోయింది)

## రాము చిత్రం ఇంకా ఖరీదు!

సంజయ్‌లీలాభన్సాలీ తీసిన 'దేవ్‌దాస్'కు అయిన ఖర్చు యాభై కోట్లు కావటం అప్పటివిశేషం. కానీ ఇప్పుడు రామ్‌గోపాల్‌వర్మ హాలీవుడ్-బాలీవుడ్ తారలు కలిసి నటిస్తున్న చిత్రం ఒకటి ప్రకటించాడు. అందులో బిగ్ బీ అమితాభ్‌బచ్చన్, అజయ్‌దేవగన్, వివేక్‌ఒబెరాయ్ వంటి వాళ్లంతా వున్నారు. యుద్ధం, టెర్రరిజం, మిలిటరీజనం వగైరా మసాలాతో హిందీ చలనచిత్రచరిత్రలోనే అతి ఖరీదైన చిత్రం తయారుకాబోతున్నదంటే మామూలు సమాచారం కాదు కదా? రాము ఆ చిత్రాన్ని పాకిస్థాన్‌లో చిత్రీకరిస్తానంటున్నాట్ట. మరిదేదో చూడాల్సిందే!

ఎస్.

